# బూటకం

వేంగూరి లక్ష్మణరావు

రమేష్ ఒక గొప్ప సినిమాసంస్థకు యజమాని. కొన్ని చిత్రాలను తనే డైరెక్టుచేసి, తనే నాయకుడిపాత్ర ధరించి ప్రేక్షకుల మన్ననలకు పాత్రుడై, కళాలక్ష్మికేకాక, ధనలక్ష్మికికూడా ముద్దుబిడ్డ డైనాడు.

గోపీనాథ్, రమేష్‌యొక్క ఆంతరంగిక కార్యదర్శి. స్ఫురద్రూపి. చాలా మంచివాడు. ఒకరి ననక, యొకరితో వ్రేలెట్టి చూపించుకొనక జీవితాన్ని సాఫీగా దొర్లించుకు పోతున్నాడు.

ఒకనాడు గోపీనాథ్ తన ఆఫీసులో పనిచేసుకుంటున్నాడు. చింపిరితలతో, పెరిగిన గడ్డముతో, చిరిగిన గుడ్డలతో ఓ బికారి గోపీనాథ్‌ముందు ప్రత్యక్ష మయ్యాడు.

'ఎవరవు నీవు ?' గోపీ ప్రశ్నించాడు.

'నేను గోకుల్‌ని' అని సమాధానం.

గోపీ కదలిపోయాడు. తన పూర్వపు జీవితం సినిమా రీల్ లాగా తిరిగింది. తను కూటికికూడాలేని వాడవటం, గోకుల్ స్నేహం దొరకటం, దొంగతనాలు చేయటం, గోకుల్‌ని పోలీసులు బంధించటం, తను తప్పించుకోవటం, తనకు విరక్తిపుట్టి విద్యవున్నాక ఈ నీచవృత్తి ఎందుకని కొన్నాళ్లు ప్రయత్నించి ఈ వుద్యోగం సంపాదించటం మొదలగు విషయాలు జ్ఞప్తికి వచ్చాయి.

"అయితే యిప్పుడు నీవెందుకు యిచ్చటకు వచ్చా"వని ప్రశ్నించాడు గోపీ.

"నేను జైలునుండి విడుదలఅయి వారంరోజులయింది. తింటానికి తిండిలేదు. నీ కొరకు వాకబు చేస్తే నీవిక్కడ దొరికావు. మనిద్దరం కలసి ఆఖరుపర్యాయం చేసిన దొంగతనంలో నా వాటా నాకు ముట్టలేదు. అది యిప్పుడు ముట్టజెపుతావా సరేసరి, లేదా నీమీదకూడా పాతనేరానికి పోలీసులకు ఫిర్యాదుచేస్తా"నని బెదిరించాడు గోకుల్, గోపీని. గోపీనాథ్ మతిపోయింది. తన యజమాని ఎక్కడ వస్తాడో, వీడెక్కడ తన పరువుకాస్తా నాశనం చేస్తాడోనని బేజారై పోయాడు. కొన్ని నోట్లుతీసి వాడి కిచ్చి అప్పటికి ఆ పీడ వదలించుకున్నాడు.

మళ్లీ నాలుగురోజులు పోయాక ప్రత్యక్షమై పాతపేటు వాయించాడు. కొన్నినోట్లుతీసి వాడికిచ్చి మళ్ళీ ఎప్పుడూ రావద్దని బ్రతిమిలాడి పంపివేశాడు.

నాలుగురోజులు పోయాక మళ్లీవచ్చి చాలా పెద్దమొత్తం యిస్తేనేతప్ప ఈ పర్యాయం వదలనని, తన యజమానితో తన పూర్వజీవితం చెప్పివేస్తానని బెదిరించేడు. గోపీనాథ్ గుండెలు వేగంగా కొట్టుకోవడం మొదలెట్టాయి. గోపీ ఎట్టకేలకు మనస్సు స్థిమితం చేసుకున్నాడు. ఒక పన్నాగం పన్నాడు. "గోకుల్ ! చేతిలో ఇప్పుడు డబ్బులేదు. ప్రక్క ఆఫీసులో గుమాస్తాని చేబదులు అడిగితెస్తాను. ఇక్కడే వుండ"మని గదితలుపు దగ్గరవేసి వెళ్లిపోయాడు.

గోకుల్ గదిలో కూర్చునివున్నాడు. తనలో తాను నవ్వుకుంటున్నాడు. ఎందుకో......? అంతట్లోకే టిక్...టిక్‌మనే బూట్ల చప్పుడుతో గోకుల్‌ముందు మానేజర్ రమేష్ ప్రత్యక్షమయ్యాడు. గోకుల్‌ని ఎవరవు నీవని గద్దించాడు.

"నేను గోకుల్"నని సమాధానం చెప్పాడు.

రమేష్ వెంటనే "ఓ...నీవా... ఆ దొంగ గోకుల్‌వి నీవేనేమిటి...సరే...నీ సంగతి అంతా గోపీచెప్పాడు. అతనిపరువు ఏదో బయటపెడతానని డబ్బుకాజేసి, మళ్ళీ తయారయ్యావా ? జాగ్రత్త ! నీ బెదరింపులకు తడు లొంగడు. అతని జీవితం అంతా నాకుచెప్పాడు. అతని గతజీవితంతో నాకు పనిలేదు. అతడు నాకు సహాయకార్యదర్శిగా, స్వామిభక్తి పరాయణతతో సేవ

---

* ఆనందవాణి